


# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుడ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

*కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో*
*అలనాటి అందమైన నవల పునర్ముద్రణ*

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**గుప్తాగారు** కళ్ళజోడు సవరించుకుని "మేటర్ లేకపోతే అట్లాగే వేసుకుంటారు ఒక్కోసారి. కథకు ఎంత యిస్తున్నారేమిటి?" అని అడిగాడు ఓరగా చూస్తూ.

మధుబాబుకి నిజం చెప్పాలనిపించలేదు. "ముప్పయి" అన్నాడు.

"ఆ..!" అని అక్కడున్న వాళ్ళంతా ఒక్కసారి నోరు ఆవలించారు. వాళ్ళకు చాలా కొద్ది మొత్తాలు వచ్చి వున్నాయి యిదివరకు.

మధుబాబుకు అక్కడ వుండబుద్దిగాక "వస్తాను" అని అక్కడినుంచి కదిలాడు.

"పెద్దవాళ్ళు వీళ్ళు."

కొన్నాళ్ళు గడిచాయి. ఓ ఆదివారం రాత్రి అతను రాసిన నాటిక ప్రసారమైంది. రేడియోముందు అతనూ, తల్లీ, తండ్రీ, తమ్ముడూ చెల్లెలూ అంతా కూర్చుని విన్నారు. సంభాషణలు ఎవరోగాని అక్కడక్కడ మార్చేశారు. కొంతభాగం కత్తిరించారు. మధుబాబుకి బాధ అనిపించింది. కానీ అతను రాసిన సంభాషణలు వాళ్ళెవరో చదువుతుంటే హాయిగా ఉంది.

నాయిక వేసిన అమ్మాయి ఒకచోట "నా ప్రాణానికి జిగురులా దాపురించావు" అన్న సంభాషణ పలుకుతూ నవ్వు ఆపుకోలేక ఓ అరనిముషం పాటు కిలకిలమని నవ్వేసింది. నాటకం ముందూ, తర్వాతా అతని పేరు చదువుతూ వుంటే చెల్లెలు చిలిపిగా ముఖంలోకి చూసి నవ్వింది. తల్లి బాగుంది అన్నది. తండ్రి ఏమీ అభిప్రాయం వెలిబుచ్చలేదు.

కాలేజి మేగజైన్ కి రచనలు వచ్చి పడుతున్నాయి. మధుబాబుతోపాటు ఇంకో విద్యార్ధి కూడా సంపాదకుడిగా వున్నాడు. కానీ అతను ఏమీ పట్టించుకోడు. బాధ్యత అంతా మధుబాబు నెత్తిన పడింది.

చీఫ్ ఎడిటర్ అయిన లెక్చరర్ ఒకాయన యితన్ని పిలిచి వచ్చిన రచనలన్నీ చదివి, చెత్తగా వున్న వాటిని వొదిలేసి మిగతావి తనకు ఇమ్మనీ అందులోంచి తను ఫైనల్‌గా సెలక్ట్ చేస్తాననీ అన్నాడు. డిసెంబరులో ఒక సంచిక వస్తుంది. ఏప్రిల్‌లో పరీక్షల సమయంలో రెండవది వస్తుంది. రెండవదాంట్లో ఎక్కువ భాగం ఫోటోలూ, వివిధ ఎసోసియేషన్‌ల రిపోర్టులూ వుంటాయి. రచనలన్నీ అతను యింటికి పట్టుకు పోయాడు. అతనింకా వాటిని చదవటం ప్రారంభించనేలేదు. కొందరు విద్యార్ధులు అతను కనిపించినప్పుడల్లా "నా రచన విషయం ఏం చేశారు?" అని వేధించటం మొదలుపెట్టారు. ఒకడొచ్చి "నేనిచ్చిన నాటిక వుంది చూశారూ? అందులో కొన్ని డైలాగులు మోతగా రాశానండి" అనేవాడు. మరొకడొచ్చి "నేనిచ్చిన కథలో ఓ గేయం కూడా రాశానండోయి. చెప్పుకోకూడదుగానీ శ్రీ శ్రీ ఎందుకూ పనికిరాడనుకోండి. అట్లా రాశాను. కొంచెం చూద్దురూ" అనేవాడు.

మధుబాబు ఓపిగ్గా చదవసాగాడు. ఎక్కువభాగం ప్రేమకథలు. లేకపోతే కాపీకొట్టిన బాపతు. కాని అక్కడక్కడా మంచివి – చాలా మంచివికూడా కనిపించాయి, లేడీస్టూడెంట్స్ దగ్గరనుంచికూడా పది పదిహేను వరకూ వచ్చాయి. వాటిని ఉత్సాహంగా చదివాడు. ఒకమ్మాయి మాతృభక్తిని గురించి రాసింది. ఒకమ్మాయి భర్తగా మొగవాడి దౌర్జన్యాన్ని గురించి రాసింది, కాని రాజ్యలక్ష్మి అనే అమ్మాయి రాసిన కథ చదువుతోంటే, అతని గుండె గుభేలుమంది. ప్రశంస అంతా కాలేజి అబ్బాయిలూ, అమ్మాయిల గురించే, ఆడపిల్లలు జట్కాల్లో పోతూంటే కుర్రాళ్ళు వెంటబడటం, నిక్ నేమ్స్ పెట్టి

ఏడిపించటం అదంతా రాసింది. ఓసారి తను (కథలో నాయిక) రైల్లో పోతోందిట. ఎదుటి సీట్లో తనక్లాస్‌మేట్ రఘు ఊరికినే ఎగాదిగా చూస్తున్నాడు. ఈ అమ్మాయి విసుక్కుంది. కాసేపటికి నిద్రవచ్చి కునికిపాట్లు పడుతోంది. ఇంతలో స్పర్శ తగిలి ఉలిక్కిపడి లేచేసరికి రఘు కంగారుగా ఆమె చేతిని పట్టుకుంటున్నాడు. మళ్ళీ ఆలోచించకుండా చాచిపెట్టి ఒక్క లెంపకాయ కొట్టింది. అతను తెల్లబోయి బిక్కమొహంతో ఏదో చెప్పబోతోంటే వినిపించుకోకుండా తిట్ల వర్షం కురిపించింది. పెట్టెలో వున్న వాళ్ళంతా యీ పిల్లనే సమర్ధించారు. ఆ అబ్బాయి ప్రక్కస్టేషన్‌లో తలవంచుకు దిగిపోయాడు. తర్వాత అతడు కాలేజీకి రాలేదు. జ్వరం ముంచూ వచ్చింది. ఆ జ్వరంలో యీ అమ్మాయినే కలవరిస్తున్నాడు. అతని తల్లిదండ్రులు వచ్చి యీ పిల్లను బ్రతిమలాడారు ఒకసారి వచ్చి చూడమని. పాపం అని జాలిపడి వెళ్ళింది. అతను ఇలా కలవరిస్తున్నాడు. "నేనేమీ దురుద్దేశంతో చేయలేదు లీలా నువ్వు నన్ను అపార్ధం చేసుకున్నావు. నువ్వు నిద్రపోతుంటే నీ వ్రేలి ఉంగరం వొదులుగా ఉందేమో జారి క్రిందపడుతోంది. నీ చెయ్యి కిటికీలో వుండటం వల్ల అది బయట పడిపోతుందేమోనన్న ఆరాటంతో చెయ్యిపట్టుకున్నాను" ఆమెకు కళ్ళనీళ్ళు తిరిగాయి. తను ఎంత అపోహపడింది. అప్పట్నుంచీ అక్కడే వుండి అతనికి సపర్యలు చేసింది, రక్షించుకుంది. తరువాత వాళ్ళిద్దరి మధ్యా పర్యవసానం పాఠకులే ఊహించుకుందురుగాక. ఇది చివరి వాక్యం.

ఇది పబ్లిష్‌చేస్తే ఈ రాజ్యలక్ష్మి కి పుట్టగతులుంటాయా అనుకున్నాడు మధుబాబు. ఎట్లా ధైర్యం చేసింది అలా రాయటానికి? మారు మాటాడకుండా దీన్ని ఒక మూలకు నెట్టివేయవచ్చు. కానీ అతనికి ఆ అమ్మాయిని చూడాలనీ, వీలైతే మాట్లాడాలనీ కోరిక కలిగింది. ఫస్టియర్ చదువుతోంది. సైన్సు గ్రూపే. మరునాటి ఉదయం ఆడపిల్లలందరూ క్లాసులకి పోతోంటే వరండాలో నిలబడి గమనిస్తూ "రాజ్యలక్ష్మి ఎవరోయి అందులో?" అని ప్రశ్నించాడు ప్రక్కనున్న అతన్ని.

"ఏం దానిమీదకు పోయింది మనసు? అదిగో అట్నుంచి నాలుగో అమ్మాయి. ఆకుపచ్చరంగు వోణీ వేసుకోలా? అదీ" అన్నాడు ఆ పక్కకుర్రాడు.

"పదహారేళ్ళకంటే ఎక్కువ ఉండవు" అనుకున్నాడు మధుబాబు. పరికిణి, వోణి వేసుకుంది. కొంచెం సన్నగా, తెల్లగా, కోలముఖం, పెద్ద పెద్ద కళ్లతో చురుగ్గా గోచరించింది. కానీ ప్రక్క విద్యార్ధి ఆమెను "అది" అని సంబోధించటం అతనికి నచ్చలేదు.అతడు ఒక్కడే కాదు. పరోక్షంలో ప్రతివాడూ అమ్మాయిల్ని గురించి అలానే మాటాడటం గమనించాడు.

మధ్యాహ్నం విశ్రాంతి సమయంలో ధైర్యం చేసి గరల్స్ రూమ్ దగ్గరకు వెళ్ళాడు. అతని గుండె గబగబ కొట్టుకోసాగింది. తను అక్కడకు ఎందుకు వెళ్ళాడో స్పష్టంగా తెలీదు. గుమ్మం ఇవతల నిలబడి బెదురుతూ లోపలకు చూశాడు.

ఆడపిల్లలందరూ లోపల నవ్వుతూ, కేరింతలు కొడుతూ హుషారుగా ఉన్నారు. ఒకళ్ళనొకళ్ళు పరాచికాలు ఆడుతున్నారు. ఒకళ్ళిద్దరు ఓ మూల గట్టిగా అరుచుకుంటూ మాటలాడుకొంటున్నారు. కొంతమంది టిఫిన్ తింటున్నారు. ఒకమ్మాయి తెలుగు నవల ఏదో చదువుతోంది. ఒకామె నేస్తురాలితో "వాడులేడూ? జనార్ధనంగాడు ఇందాక నోట్స్ అడిగాడు సిన్సియర్‌గా పోజు వేసి" అంటూ మధుబాబు ముఖం కనిపించి ఆగిపోయి, నాలిక కొరుక్కుని నెమ్మదిగా లోపలకు జారుకుంది.

ఓ ఎఱ్ఱటి అమ్మాయి బయటికొచ్చి "ఎవరు కావాలండి?" అనడిగింది సంకోచించకుండా.

"రాజ్యలక్ష్మి " అన్నాడు తడబడుతోన్న కంఠంతో మధుబాబు.

"ఎందుకొచ్చాను బుద్ధి గడ్డితిని ఇక్కడకు?" అని లోలోపల విసుక్కున్నాడు.

"ఏ రాజ్యలక్ష్మి  అండి?" అన్నదా పిల్ల కొంచెం ముందుకు వంగి, ప్రశ్నార్థగంగా ముఖం పెట్టి.

"ఎన్. రాజ్యలక్ష్మి , ఫస్టియర్ బై.పి.సి."

ఆ అమ్మాయి లోపలకు వెళ్ళి గట్టిగా "ఓ రాజ్యలక్ష్మి  ఎన్. ఫస్టీయర్ బై.పి.సి నీకోసమెవరో వేంచేశారు.. దయచెయ్యి" అన్నది కొంటెగా.

లోపలనుండి రాజ్యలక్ష్మి  కొంచెం కంగారుగా ఇవతలకు వచ్చింది. గుమ్మమ ఇవతల నిలబడివున్న మధుబాబుని చూశాక "మీరా?" అన్న తళుక్కుమన్న భావం ఆమె వదనమండలంలో ద్యోతకమైంది.

"ఏమిటండి?" అన్నది దగ్గరకొచ్చి నిలబడి ఎంతో చనువుగా.

మధుబాబు నమస్కారం పెడదామని ఆ సంగతి మరిచిపోయాడు. అంతేగాక తను వచ్చింది వొట్టినే ఆషామాషీగా కాదనీ, సకారణయుతంగాననీ ఆమెకు వెంటనే తెలిసేటట్లు చేయాలని తాపత్రయ పడసాగాడు.

"మీతో ఒక విషయం మాట్లాడదామని వచ్చానండీ" అన్నాడు తొట్రుపాటుతో.

రాజ్యలక్ష్మి  వెనక్కి తెరిచివున్న తలుపుకి భుజాన్ని ఆనించి, చేతులు రెండూ హృదయం మీదుగా కట్టుకుని "చెప్పండి" అన్నది చిన్నగా నవ్వి.

ఈ దృశ్యం చూపరులకు  ఎలా ఉంటుందా అని ఆలోచించాడు మధుబాబు. తాను దిగువున నిలబడి కొంచెం తలెత్తి మాట్లాడుతూండటం ఆమె కాస్త ఎత్తులో వయ్యారంగా తలుపుకి భుజాన్ని ఆనించి నవ్వుతూ

మాటలాడుతూండటం.." అప్పుడప్పుడు కొంతమంది స్టూడెంట్స్, లేడీ స్టూడెంట్స్‌తో ఇక్కడ నిల్చుని సంభాషించేటప్పుడు ఇదే భంగిమలో కనబడ్డారు. ఇతరుల దృష్టికి ఫలానా విధంగా గోచరించాలని అజ్ఞాతంగా వీళ్ళు ఊహిస్తూ వుంటారనటంలో పొరపాటు యేమీలేదుకదా.

"మేగజైన్‌కి కథ ఒకటి ఇచ్చారు చూశారూ.."

లోపల అమ్మాయిల అల్లరి హెచ్చుతోంది. "వాడు లేడూ..? ఆ అరేబియన్ హార్సుగాడు" అంటోంది ఎవర్ని గురించో ఓ రాలుగాయి.

"వీళ్ళూ ఇంతే. అబ్బాయిల్ని గురించి వాడు, వీడూ అనే సంభోదిస్తూ వుంటారు" అని విస్మయం చెందాడు మధుబాబు.

"చదివారా?" అంది రాజ్యలక్ష్మి కొంచెం సిగ్గుపడి.

"చదివాను" అని ఊరుకున్నాడు మధుబాబు. తాను ఏమి చెబుదామని వచ్చాడు? ఇక్కడ బాగుంటుందా ఆ ప్రసక్తి?

"అది ... చూశారూ ఆ కథ బాగానే వుంది గాని బాయిస్ గురించి అలా రాయటం, చివర్న ముగింపు కొంచెం ఇదిగా వున్నాయి. అందులో ఫస్ట్ పర్సన్‌లో రాశారు. అది పబ్లిష్ చేస్తే స్టూడెంట్స్ సంగతి మీకు తెలియని ఏముంది?" అంటూ ముక్కలు ముక్కలుగా విషయం బయట పెట్టేశాడు.

రాజ్యలక్ష్మి కిలకిలమని నవ్వి "మొహమాట పడ్తున్నారే ఉన్న విషయం చెప్పటానికి" అంది.

సిగ్గుతో మధుబాబు ముఖం అరుణరాగరంజితమైంది. చేతులు కిందికి దించి వోణీ అంచు వ్రేలికి చుట్టుకుంటూ "నిజమేనండి, పిచ్చిదానిలా ఏదో రాశాను, ఎందుకలా రాశానో నాకే తెలిదు. తరువాత ఆలోచించుకుంటె బలే సిగ్గేసింది. అది కర్మంకాలి మీరు అచ్చువేస్తే యీ కుఱ్ఱాళ్ళు నన్ను బ్రతకనివ్వరు. చింపెయ్యండి దాన్ని ప్లీజ్" అన్నది జాలిగా ముఖం పెట్టి.

"ఆ, చింపటమెందుకులెండి, తిరిగి పంపించేస్తాను. పోనీ ఇంకోటి రాసివ్వండి" అన్నాడు మధుబాబు సంకోచంగా, అతనికి ఆశ్చర్యంగా వుంది ఆమె మాటలకు.

ఆమె పెదవి విరిచి "కథలు తక్కువైనాయి నా బ్రతుక్కి. ఎందుకో ఇప్పుడే రాశానంతే. ఏదో గమ్మత్" అని ఆలోచిస్తూ వూరుకుంది.

మధుబాబు నీరస కంఠంతో "మీ ఇష్టం, మరి వస్తాను సెలవు" అంటూ వెనక్కి తిరిగాడు.

"సెలవు కవిగారూ" అన్నది రాజ్యలక్ష్మి మృదుకంఠంతో వెనుకనుండి.

ఒక మృదు సుగంధం వీచినట్లయింది. అతను ఆగి వెనక్కి చూసి, "నేను కవినిగాను, రచయితను" అన్నాడు.

"ఉహూ...అలాగా? నాకు రెంటికీ డిఫరెన్సు తెలీదులెండి. అయితే సెలవు అభిమాన రచయితగారూ అంది" కొంచెం నవ్వి.

అతడు పులకితుడైనాడు. ఈ అనుభూతి సరికొత్తది. "నమస్తే" అంటూ మెల్లిగా అక్కడ్నించి కదిలాడు.

ఓ సంధ్యా సమయాన రాజ్యలక్ష్మి మరో స్నేహితురాలితో కాలేజీకి అవతలగా కాలవ ఒడ్డున షికార్లు కొడుతూ మధుబాబుకు గోచరించింది. అతను రాసుకుందామని క్లాసులు అయిపోయాక అటుకేసి వెళ్ళాడు. ఆమె చెలికత్తెతో సాక్షాత్కరించింది.

"రండి, రచయితగారూ రండి. ప్రకృతి సౌందర్యాన్ని తనివితీరా గ్రోలుదామని ఇలా వచ్చాం. చూశారా ఈ కాలవ నిండుగా, గర్వంగా, అస్తమిస్తోన్న సూర్యకాంతిలో ఎర్రని కాంతులు చిమ్ముతూ ఎలా ప్రవహిస్తోందో, దూరంగా ఆ సగం విరిగిన కొండ చూడండి. జీవితమే విరిగినట్లు లేదూ దాన్ని చూస్తూంటే? అబ్బ చుట్టూ రకరకాల యీ మొక్కలు, చెట్లు అర్థంలేని పువ్వులు ఈ కాలవలో దూకి చచ్చిపోవాలని వుందండీ" అనేసింది రాజ్యలక్ష్మి తెరిపిలేకుండా.

ప్రక్కనున్న స్నేహితురాలు ఆమె తలమీద ఒక్కటిచ్చుకుని "ఆపవే పిచ్చి మొద్దూ నీ వాగుడు" అంది మందలిస్తూ.

మొదట వాళ్ళనా ప్రాంతంలో చూసి, ఇబ్బందిలోపడి అక్కడ్నుంచి వెళ్ళిపోదామనుకున్నాడు. ఈ ధోరణి చూసి చకితుడై శిలా విగ్రహంలా నిలబడినాడు. ఆ సూర్యాస్తమయ కాంతిలో, ప్రకృతి శోభలో ఆ లేత మగువ వనదేవతలా గోచరించింది అతనికి.

"మాట్లాడక నిలబడ్డారేం? రండి. ఆ ఇసుక రాసులమీద కూర్చుని కబుర్లు చెప్పుకుందాం" అని అటుకేసి దారితీసింది. రాజ్యలక్ష్మి మిత్రురాలు కొంచెం ఇరకాటంలో పడింది. ఐనా యీ కొత్త అబ్బాయిముందు నోరు మెదల్చలేక అనుసరించింది.

స్నేహితురాళ్ళిద్దరూ ప్రక్కప్రక్కన చతికిలపడినారు. మధుబాబు కొంచెం ఎడంగా కూర్చున్నాడు.

"మీ కథలంటే నాకు చాలా ఇష్టమండి" అంది రాజ్యలక్ష్మి సంభాషణ ప్రారంభిస్తూ.

ఒక అందమైన అమ్మాయినుంచి ఈ కాంప్లిమెంటు లభించిందంటే ఎవరు మధురానుభూతిని పొందరు గనక? అతను చిరునవ్వు నవ్వాడు మనసులో ఆశ్చర్యపడుతూ. రాజ్యలక్ష్మి ఒక్క నిముషం మౌనం వహించి "మీరు అంతా వూహించి రాస్తారా, జీవితాన్నుంచి చూసి రాస్తారా" అని ప్రశ్నించింది.

కొన్నాళ్ళక్రితం ఐతే అతను ఈ ప్రశ్నకు తికమకపడి వుండేవాడు. ఇప్పుడు కొంచెం కొంచెం నేర్చుకుంటున్నాడయ్యె.

"నా వయసు చాలా చిన్నది" అన్నాడు. ప్రపంచంలో నాకు తెలీని విషయాలు ఎన్నోవున్నాయి. నా అనుభవం చాలా కొద్దిపాటి. ఊహిస్తాను కాని ఊహించేటప్పుడు నన్నా పరిస్థితులలో ఇమాజిన్ చేసుకుని వ్యక్తిగతమైన అనుభూతి పొందుతాను. అదే రాస్తాను."

నిజానికి ప్రపంచాన్ని మిమర్శనా దృష్టితో పరిశీలించి అది సాహిత్యంగా రూపొందించగలిగే శక్తి అతనికింకా అలవడలేదు. కానీ అతను వూహించి రాసేవన్నీ ఎక్కడో నిజాలుగానే వున్నాయి.

"మీ ఆశయం ఏమిటి?" అనడిగింది రాజ్యలక్ష్మి .

"అది నేనింకా స్పష్టంగా తెలుసుకోలేదు. నన్ను బాధించే వేధించే సమస్యలు అనేకం కనిపిస్తున్నాయి. వాటిల్లో నేను మనస్ఫూర్తిగా దేన్ని వరించాలో తెలుసుకోలేని స్థితిలో వున్నారు. రోజు రోజుకు నాలో కొత్తదనం ఫీలౌతున్నాను. ఈ నూతనత్వం ఆగిపోయేవరకూ నాకు నేను స్పష్టంగా అర్థంకాను. దానంతటది సహజంగా సిద్ధించేవరకూ నేనేమీ సిద్ధాంతాలు లేవదియ్యను. వాటిని ఇతరుల మీద ప్రయోగించను. నేను స్వంతంగా కొన్ని అనుభవాలు పొందాలి. ఐనా యీ అతివాదాలూ, ఇజమ్స్ నాకు సరిపడవు. మానవత్వానికి దెబ్బకొట్టే ప్రతి అంశమూ నాకు వస్తువే. ఈ మానవత్వపు విలువల్ని ప్రదర్శించటమే బహుశా నా ఆశయమనుకుంటాను. జీవితాన్ని కప్పివేసే అనేక తెరలు ఉంటాయి. ఈ తెర చాటున అసలు నిజం ఎక్కడో దాక్కుని వుంటుంది. వాటిని తలుచుకుంటూపోయి, ఈ నిజాన్ని ప్రకటించడమే బహుశా నాలక్ష్యం" మధుబాబు ఆగాడు.

అతనిప్పుడు మాట్లాడిన మాటల్లో పూర్తి నిజాయితీ వుంది. కొంతమందికి ఓ ప్రకృతి వుంటుంది. ఫలానా అంశాన్ని గురించి స్థిరమైన అభిప్రాయమంటూ ముందునుంచుండదు. ఎవరైనా దాన్ని గురించి గ్రుచ్చి గ్రుచ్చి ప్రశ్నించినపుడు ఆత్మ విమర్శ చేసుకుంటూ సమాధానం మొదలుపెడతారు. ఒకే సమయంలో అభిప్రాయాన్ని ఏర్పాటు చేసుకోవటమూ, దాన్ని తరులకి వ్యక్తం చేయటమూ జరుగుతుంది.

"అసలు మీరు రాయటం ఎందుకు మొదలుపెట్టారు? అనడిగింది రాజ్యలక్ష్మి ముగ్ధురాలై. స్నేహితురాలు ఇసుకని గుప్పిళ్ళలో తీసి క్రిందకు విడుస్తోంది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Post your comments